క్లుప్తంగా

పీఎం సూర్యఘర్‌పై విస్తృత ప్రచారం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సత్యప్రసాద్ తదితరులు

కడియం: పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంపై విస్తృత ప్రచారం చేయాలని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ పథకంపై సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. ప్రత్యేక డ్రైవ్ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఈ పథకంపై అవగాహన పెంచాలని ఎంపీపీ సూచించారు. ఇందు కోసం విస్తృత కార్యాచరణ రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో కె.రమేష్, విద్యుత్‌శాఖ అధికారులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

హబీబుల్లా ఖాన్‌కు షర్మిలారెడ్డి పరామర్శ



హబీబుల్లా ఖాన్‌ను పరామర్శించిన షర్మిలారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు హబీబుల్లా ఖాన్‌ను మంగళవారం ఏపీహెచ్‌బీసీ మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి ఆయన నివాసంలో పరామర్శించారు. తొందరగా ఆరోగ్యంగా కోలుకొని పార్టీకి మీ సేవలు అందించాలన్నారు. సిటీ మైనార్టీ ప్రెసిడెంట్ ఎండి.ఖాన్, వైస్ ప్రెసిడెంట్ ఎస్.కె.షరీఫ్ తదితరులు ఉన్నారు.

సే నో టు ప్లాస్టిక్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఆదిత్య కళాశాల విద్యార్థులు

కంబాలచెరువు: ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల ఆధ్వర్యంలో మంగళవారం సే నో టు ప్లాస్టిక్ ర్యాలీని నిర్వహించారు. అంతర్జాతీయ అవగాహన కార్యక్రమంలో భాగంగా సుమారు 200 మంది వలంటీర్లతో ఈ ర్యాలీ చేపట్టారు. ముందుగా ఆదిత్య మేనేజ్‌మెంట్ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువతను జాగ్రత్త చేయడానికి వారిలో నైపుణ్యాలు అభివృద్ధి చేసేందుకు కార్యక్రమం దోహదపడుతుంది.కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు నేతృత్వంలో కళాశాల నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, వెంకటేశ్వర మార్కెట్, మహిళా డిగ్రీ కళాశాల వరకు సే నో టు ప్లాస్టిక్ ర్యాలీ సాగింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్ సీహెచ్ ఫణికుమార్, చంద్రశేఖర్ ఎస్‌కేఎస్ రెహమాన్, జేసీఐ అధ్యక్షుడు రాఖీ జైన్, జోన్ డైరెక్టర్ బిజినెస్ డాక్టర్ ప్రియాంక అనసూరి, పూర్వ అధ్యక్షులు కృష్ణ చైతన్య, జిల్లా జేసీఐ సభ్యులు రాహుల్, బీహెచ్‌వీ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అవసరానికి మించి వాడొద్దు

రాజమహేంద్రవరం రూరల్: అవసరానికి మించి యూరియా వాడకం వలన నేల దాని సహజ స్వభావం కోల్పోతుందని మండల వ్యవసాయాధికారి భీమరాజు అన్నారు. మంగళవారం హుకుంపేటలోని స్త్రీశక్తి భవనంలో మండల మహిళాసమాఖ్య సమావేశంలో నానో ఎరువుల వినియోగంపై విస్తృత ప్రచారం, నానో ఉత్పదనాల ప్రదర్శన, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో సెర్ప్ ఏపీఎం, డీపీఎం, వ్యవసాయ విస్తరణాధికారి పీటర్, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల :	ఘాటీ
సూర్యమినీ :	ది కంజూరింగ్
సూర్యప్యాలెస్ :	ఘాటీ
స్వామి :	కూలీ
అనుశ్రీ :	మదరాసి
శివజ్యోతి :	ది బెంగాల్ ఫైల్స్
రాజా :	మదరాసి
ఊర్వశి :	లిటిల్‌హార్ట్స్
మేనక :	ది కంజూరింగ్
రంభ :	మహావతార్ నరసింహ
అప్సర :	కొత్తలోక
అశోక :	మదరాసి
నామవరం	
వీఎస్ మహల్ :	ఘాటీ
ధవళేశ్వరం	
మురళీకృష్ణ :	ఘాటీ, మదరాసి
కడియం	
వెంకటసూర్య :	మదరాసి, ఘాటీ



అన్నదాత పోరుకు తరలి వెకుతున్న వేణు, రాజా, సూర్యనారాయణరెడ్డి, శ్రీనివాస్, షర్మిలారెడ్డి



పార్టీ కార్యాలయం నుంచి అన్నదాతపోరుకు పార్టీశ్రేణులతో కలిసి బయలదేరుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు వేణు



రోప్, బారికేడ్లతో బైక్‌ర్యాలీని నిలిపివేసిన పోలీసులు



పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను కారులో వెళ్లాలని సూచిస్తున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు

అన్నదాత పోరుకు అడ్డంకులు

- బొమ్మూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద భారీగా మోహరించిన పోలీసులు
- మాజీ మంత్రి వేణు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ
- శాంతియుత ర్యాలీని అడ్డుకున్న పోలీసులు
- జక్కంపూడి రాజా గృహం వద్ద తీవ్ర ఉద్రిక్తత
- రోడ్డుపై బైఠాయించిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



రాజమహేంద్రవరంలో అన్నదాత పోరుకు వెళ్తున్న మాజీ మంత్రి వేణు, మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, సత్తి సూర్యనారాయణరెడ్డి, పార్లమెంటరీ కోఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్, ఏపీహెచ్‌బీసీ మాజీ చైర్ పర్సన్ షర్మిలారెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: రైతన్నలపై కూటమి ప్రభుత్వం దగాను నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన 'అన్నదాత పోరు' కార్యక్రమానికి పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు. బొమ్మూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఉదయం నుంచే పోలీసులు భారీగా మోహరించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లిబోయిన వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఆర్డీవో కార్యాలయానికి బైక్ ర్యాలీగా వెళుతుంటే అడ్డుకున్నారు. పార్టీ శ్రేణులు బైక్‌లను పార్టీ కార్యాలయంలోకి కూడా అనుమతించలేదు. రోడ్డు పక్కనే నిలిపివేశారు. దీంతో చెల్లిబోయిన వేణుగోపాలకృష్ణ, పార్టీ శ్రేణులతో కలిసి నడుచుకుని రోడ్డుపైకి వచ్చారు. అక్కడ నుంచి బైక్ ర్యాలీగా బయలదేరుతుండగా, భారీ బైక్ ర్యాలీకి అనుమతి లేదని, మీవెంట నలుగురిని మాత్రమే పంపిస్తామని కడియం పీఎస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు మాజీ మంత్రి వేణుకు చెప్పారు. పార్టీశ్రేణులతో కలిసి ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసు సిబ్బంది బారికేడ్లు, రోప్‌వేసి మరీ అడ్డుకున్నారు. ర్యాలీగా పంపించేది లేదని, ఎవరికి వారే వెళ్లాలని పార్టీశ్రేణులకు పోలీసులు హెచ్చరించారు. ముందుగా చెల్లిబోయిన వేణును పోలీసులు కారులో పంపించేసి, అనంతరం పార్టీశ్రేణులను నిలుపుదల చేశారు. కూటమి ప్రభుత్వం డౌన్ డౌన్ అంటూ పార్టీ నాయకులు నినాదాలు చేశారు. అనంతరం పార్టీ శ్రేణులు పోలీసులు నుంచి తప్పించుకుని వేరే మార్గంలో భారీ ఎత్తున రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఇంటి వద్దకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి అంగాడి సత్యప్రియ, రాష్ట్ర పంచాయతీ విభాగం కార్యదర్శి తిరుమలశెట్టి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాల చక్రవర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు బొప్పన సుబ్బారావు, జిల్లా అధికార ప్రతినిధి పెయ్యల రాజేష్, జిల్లా కార్యదర్శులు యెనుముల త్యాగరాజు, ముద్దాల అను, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ వెలుగుబంటి అచ్యుతరామ్, వివిధ విభాగాల నియోజకవర్గ అధ్యక్షుడు చీకురుమిల్లి చిన్న, ఆచంట కల్యాణ్, చింతపర్తి రాంబాబు, టేకి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు ఈలిగోపాలం, బోడపాటి సత్యనారాయణ, మద్దా దుర్గారావు, నక్కా రాజేంద్ర, దుంపాచంద్రారెడ్డి, కోటిపల్లిరవి, వైఎస్ కుమార్, కాకులపాటి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత పోరును అణగదొక్కే ప్రయత్నం

రాజమహేంద్రవరం సిటీ: రైతులకు అండగా ఉండి, ఎరువుల బ్లాక్ మార్కెట్, కనీసం యూరియా కూడా సరఫరా చేయలేని కూటమి ప్రభుత్వం తీరుపై వైఎస్సార్ సీపీ ఉద్యమించింది. రైతుల కోసం మంగళవారం చేపట్టిన అన్నదాత పోరు శాంతియుత ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం ప్రకాశంనగర్‌లోని మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా స్వగృహం నుంచి పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు శాంతి యుతంగా ర్యాలీగా వెళ్లాలని భావించిన పార్టీ శ్రేణులను బయలుదేరుతున్న సమయంలో పోలీసులు అడ్డుకున్నారు. సెక్షన్ 30 అమలులో ఉందంటూ పోలీసులు ర్యాలీని ముందుకు కదలనివ్వకుండా అడ్డుపడ్డారు. దీంతో జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ, జక్కంపూడి రాజా, పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఏపీహెచ్‌బీసీ మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చందన నాగేశ్వర్ తదితర నాయకులు రోడ్డు మీద బైఠాయించి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అన్నదాతకు అవసరమైన యూరియా సకాలంలో సరఫరా చేయలేని కూటమి ప్రభుత్వం గద్దె దిగాలని, ఇలాంటి ప్రభుత్వం అవసరం లేదని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ర్యాలీని పోలీసులు అడ్డుకోవడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. వెంటనే రైతులకు యూరియా సరఫరా చేయాలని, యూరియాను బ్లాక్ మార్కెట్టుకు తరలిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, జక్కంపూడి రాజా డిమాండ్ చేశారు. రైతులకు సాగునీరు, యూరియా సరఫరా చేయలేని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మా కొద్దంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వైఎస్సార్ సీపీ ర్యాలీకి అనుమతి లేదని, కేవలం పది మంది మాత్రమే ఆర్డీవోకు వినతిపత్రం ఇచ్చేందుకు అనుమతి ఇస్తామని పోలీసులు చెప్పారు. అయినా తాము ర్యాలీగా వెళ్తామంటూ పార్టీ నాయకులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.

నిలువునా మోసం

జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలకృష్ణ , మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ రైతులపై ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందన్నారు. రాష్ట్రం వ్యవసాయ ఆధారం అయినప్పటికీ సీఎం చంద్రబాబు పంటలు వేయవద్దని చెబుతుండడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో రైతు మాఫీ చేస్తామని చెప్పి వారిని నిలువునా ముంచేశారని ఆరోపించారు. తమ ప్రభుత్వం హయాంలో రైతులకు అండగా ఉన్నామన్నారు. రైతు భరోసా సొమ్ము మొదలుకొని సీజన్ ముగిసే లోపే పంట నష్టపరిహారం అందించామని, క్రాప్ ఇన్సూరెన్స్ ప్రభుత్వమే భరించందని తెలిపారు. తక్షణమే యూరియా కొరతను నివారించాలని వారు డిమాండ్ చేశారు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కంటే రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే రైతులను మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో యురియా కొరతపై వైఎస్సార్ సీపీ ఆందోళనలు చేపడుతుంటే పోలీసులను అడ్డం పెట్టుకుని కనీసం ఆర్డీవోకు వినతిపత్రం అందజేయకుండా చేయడం దారుణమన్నారు. ఈ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేసి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరంలో ఈ పరిస్థితి ఎమర్జెన్సీని తలపిస్తోందన్నారు. పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో రైతులు భరోసా లేదన్నారు. ఈ కార్యక్రమంలో నక్క రాజబాబు, బొంత శ్రీహరి, నరవ గోపాలకృష్ణ, అడపా అనిల్ కుమార్, సునీల్ కుమార్, మహమ్మద్ ఆరిఫ్, అరిపుల్ల ఖాన్, పెంకే సురేష్ కుమార్, నక్కా నగేష్, నాళం రోశయ్య, మాసారామ్ జోగ్, మానే దొరబాబు, గేడి అన్నపూర్ణ రాజు, అంగాడి సత్య ప్రియ, సమీరా, సత్తార్, జోన్నాడ విల్సన్, తగరం సోము, రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజక వర్గాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయం దారులు మూసేసిన పోలీసులు

అన్నదాత పోరు ర్యాలీని కూటమి ప్రభుత్వం పోలీసుల అండతో భగ్నం చేసేందుకు చర్యలు చేపట్టింది. ర్యాలీని ప్రారంభంలోనే అడ్డుకోవడంతోపాటు వినతిపత్రం ఇచ్చేందుకు రాకుండా ఉండేలా సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే నాలుగుదారులను బారికేడ్లు ఏర్పాటు చేసి మూసివేశారు.

మానసిక చికిత్స కేంద్రం పరిశీలన



ప్రభుత్వాసుపత్రిలో మానసిక చికిత్స కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

కంబాలచెరువు: రాజమహేంద్రరం ప్రభుత్వాసుపత్రిలోని మానసిక చికిత్స కేంద్రాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి మంగళవారం పరిశీలించారు. అక్కడ చికిత్స పొందుతున్న రోగుల వివరాలు, వారికి అందుతున్న వైద్య సదుపాయాలు, ఆసుపత్రి వాతావరణంపై సంబంధిత అధికారులను వివరాలు అడిగారు. మానసిక రుగ్మతల నుంచి కోలుకున్న వారిని కుటుంబ సభ్యులతో తిరిగి కలిపేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా న్యాయ సహాయం అందిస్తామన్నారు. రోగులు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి, వారి ఆరోగ్య పరిస్థితులు, ఆసుపత్రి అందిస్తున్న వైద్య సేవల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం గౌతమీ జీవకారుణ్య సంఘం వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. వారికి అందుతున్న సదుపాయాలపై వివరాలు సేకరించారు. అదేవిధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి, ఏదైనా న్యాయ సహాయం అవసరమైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు.

ఉపకరణాల నిర్ధారణ శిబిరం



శిబిరంలో దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు

ధవళేశ్వరం: జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల నిర్ధారణ వైద్య శిబిరాన్ని మంగళవారం ధవళేశ్వరం బాలికోన్నత పాఠశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ సోము వీర్రాజు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి, ఏఎంఓడీ గౌరీశంకరరావు, సీఎంవో శ్రీనివాసరావు, రాజమహేంద్రవరం రూరల్ ఎంఈవో ఏఆర్‌కేడీ తులసీదాస్, ఎంఈవో–2 బీకే చందుకుమార్, ఐఈ కో–ఆర్డినేటర్ కనకబాబు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం పడిగాపులు

- క్యూలైన్‌లో చెప్పులు, రాళ్లు పెట్టిన రైతులు
- పోలీస్ బందోబస్తు మధ్య పంపిణీ



వంగలపూడి సొసైటీ వద్ద క్యూలో రైతులు చెప్పులు, రాళ్లు ఉంచిన దృశ్యం

సీతానగరం: గ్రామాల్లో యూరియా కోసం రైతుల పాట్లు పడుతున్నారు. సొసైటీల వద్ద గంటల తరబడి పడిగాపులు పడుతున్నారు. లైన్‌లో నిలుచోలేక క్యూలో చెప్పులు, రాళ్లను పెడుతున్నారు. ఎంత క్యూలో నిలిచి ఉన్నా రైతుకు బస్తా చొప్పున అందించారు. అందని రైతులు వెనుతిరిగుతున్నారు. అది కూడా పోలీస్ బందోబస్తు మధ్యలో యూరియాను పంపిణీ చేస్తున్నారు. మంగళవారం వంగలపూడి పీఏసీఎస్ (సొసైటీ) వద్ద రైతులు తెల్లవారు జామున క్యూలైన్‌లో రాళ్లు, చెప్పులు ఉంచారు. ఉదయం 8.30 గంటలకు సొసైటీ సిబ్బంది రావడంతో రైతులు అక్కడకు చేరుకున్నారు. సొసైటీకి 20 మెట్రిక్ టన్నులు (450 బస్తాలు) యూరియా వచ్చింది. ఒక రైతుకు ఒక బస్తా చొప్పున సొసైటీ సీఈఓ పంతం సూర్యనారాయణ అందించారు. మిగిలిన రైతులు యూరియా బస్తాలు లేక వెనుతిరిగారు. రాపాక సొసైటీలో పోలీస్ బందోబస్తుతో రైతులకు యూరియా బస్తాలు అందించారు. రాపాక, నల్గొండ రైతులు పెద్ద సంఖ్యలో సొసైటీకి తరలివచ్చారు. దీంతో సీఈఓ కాట్నం వెంకటేశ్వరరావు సూచనలతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. రైతులు రెండు యూరియా బస్తాలు చొప్పున అందించారు. నల్గొండకు చెందిన రైతులు తమకు రావాలసిన బస్తాలు నేరుగా అందించాలని కోరగా రాపాక రైతుల అభ్యంతరం తెలిపారు. క్యూలైన్‌లో నిలుచుని మీకు రావలసిన బస్తాలు పట్టుకువెళ్లాలని తెలిపారు. దీంతో నల్గొండ రైతులు నిరసనకు దిగారు. సీఈఓ మండల వ్యవసాయశాఖాధికారి గౌరీదేవి దృష్టికి తీసుకువెళ్లగా సీతానగరంలోని గ్రోమోర్ రిటైల్ సెంటర్‌లో నల్గొండకు చెందిన 50 మంది రైతులకు వంద బస్తాలు అందించారు.



రాపాక సొసైటీ వద్ద యూరియా కోసం క్యూలో నిలుచున్న రైతులు

ఐటీఐ అభ్యర్థులకు అప్రెంటిస్‌షిప్ అవకాశాలు

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక ప్రభుత్వ ఐటీఐ ఆధ్వర్యంలో పరిశ్రమల్లో శిక్షణ పొందడానికి ఆసక్తి ఉన్న అభ్యర్థులకు అప్రెంటిస్‌షిప్ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రా పేపర్ మిల్ లిమిటెడ్ రాజమహేంద్రవరం యూనిట్‌లో ఐటీఐ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్, మెకానిక్, ఇనిస్ట్రుమెంట్ మెకానిక్, వెల్డర్, సివిల్ అభ్యర్థులకు అవకాశం ఉందన్నారు. స్టైఫండ్ రూ.8,050 ఇస్తారన్నారు. శ్రీసిటీలో బ్లూస్టార్ లిమిటెడ్‌లో ఐటీఐ ఆర్అండ్ ఏసీ, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ అభ్యర్థులకు, స్టైఫండ్ రూ.12,500 ఇస్తారన్నారు. చక్రద్వారబంధం ఐడీఈఎఫ్‌లో ఐటీఐ ఫిట్టర్, వెల్డింగ్ అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఉందన్నారు. స్టైఫండ్ రూ.10 వేలు ఇస్తారన్నారు. అభ్యర్థులను రాత పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ సర్టిఫికెట్ కాపీలు, ఆధార్ సీడింగ్‌తో బ్యాంక్ అకౌంట్ వివరాలు, ఒక పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటో, పాన్‌కార్డును ఈనెల 25లోపు ప్రభుత్వ ఐటీఐ, కలెక్టరేట్ వెనుక, ధవళేశ్వరం, రాజమహేంద్రవరం అడ్రస్సులో సమర్పించాలన్నారు. పరీక్ష తేదీ, ఇతర వివరాలకు కార్యాలయ పనివేళలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ తెలిపారు.

ఘనంగా శ్రీకరి వార్షికోత్సవం



ఆలయ ప్రాంగణంలో పారాయణ చేస్తున్న సభ్యులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ శ్రీకరి లలితామండలి 44వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం సాయంత్రం స్థానిక టి.నగర్‌లోని విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. శతాధిక ముత్తైదువులు పాల్గొని లలితా, విష్ణు సహస్రనామాలు, హనుమాన్ చాలీసా, సౌందర్య లహరి శ్లోకాలను పారాయణ చేశారు. సంస్థ వ్యవస్థాపకురాలు గ్రంధి విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళా శక్తి ఆధ్యాత్మిక శక్తిగా ఎదగాలన్న లక్ష్యంతో సంస్థను ప్రారంభించామన్నారు. సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రంధి రంగారావు, సాహితీవేత్త ఎర్రాప్రగడ ప్రసాద్, లక్ష్మిదంపతులు, సదనం కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ రత్నావతి తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు సకాలంలో చేపట్టాలి

పెదపూడి: వరిసాగులో రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడి సాధించాలని వ్యవసాయశాఖ మండలాధికారి ఎస్.సత్యప్రసాద్ అన్నారు. దోమాడ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యప్రసాద్ మాట్లాడుతూ సాగుకు సంబంధించి రైతులు వ్యవసాయశాఖ అధికారులు, సూచనలు, సలహాలు పాటించి తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు సాధించాలన్నారు. నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి శ్రీనివాసు గౌడ్, గ్రామ సర్పంచ్ మీనవల్లి శారదదేవి, గ్రామ పెద్దలు, రైతులు, మీనవల్లి సత్తిబాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం పంపిణీ



బాలింతకు కిట్‌లు పంపిణీ చేస్తున్న రామకృష్ణ మిషన్ బృందం సభ్యులు

ధవళేశ్వరం: రాజమహేంద్రవరం రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో మాతా శిశు సంరక్షణ పథకంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు పోషకాహారం, మందుల కిట్లను పంపిణీ చేశారు. ధవళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఆర్‌వీవీ సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో 220 మందికి అందజేశారు. కార్యక్రమాన్ని నిర్వహించిన రామకృష్ణ మిషన్ బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రోహిత, డాక్టర్ మణికంఠ, డాక్టర్ వేణుమాధవి, రామకృష్ణ మిషన్ కార్యదర్శి పరిజ్ఞేయనందజీ మహరాజ్, ఇన్‌చార్జి లోకమయనందజీ మహరాజ్, కేవీ ప్రసాద్, ఫణి కుమార్, భగీరధరాజు, సాయికుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): స్థానిక సీతంపేట మూలగొయ్యి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో యువకుడి పరిస్థితి విషయంగా మారింది. దీనికి సంబంధించి మూడో పట్టణ పోలీసులు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. రావులపాలెంకు చెందిన తేజ వెంకటేష్(22) అతని స్నేహితులు నగరానికి చెందిన అనిల్‌కుమార్(22), చక్రవర్తితో కలిసి టిఫిన్ చేసేందుకు సీతంపేట నుంచి గోకవరం బస్టాండ్‌కు మోటారుసైకిల్‌పై వెళుతున్నారు. మూలగొయ్యి ప్రాంతం వచ్చే సరికి ఎదురుగా వస్తున్న మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన చెత్తను సేకరించే వాహనం వీరు బైక్‌ను తగిలింది. దీంతో బైక్‌పై ఉన్న తేజ వెంకటేష్, అనిల్‌కుమార్‌లకు తీవ్రగాయాలయ్యాయి. చక్రవర్తి బైక్ పై నుంచి దూకేశాడు. తేజ వెంకటేష్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. అనిల్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉంది. చక్రవర్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్టాఫ్ నర్స్‌లకు నియామక పత్రాల అందజేత

కంబాలచెరువు: రాజమహేంద్రవరం ఆర్డీ కార్యాలయంలో స్టాఫ్ నర్స్‌ల కౌన్సెలింగ్ మంగళవారం నిర్వహించారు. జోన్ 2 పరిధిలో ఆర్డీ పద్మాశశిధర్ అభ్యర్థులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎంపికైన వారికి ధృవపత్రాలను అందజేశారు.